వివాహానికి వీఐపీలు హాజరు



వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, తదతరులు

పాపన్నపేట,ఏప్రిల్ 20: పాపన్నపేటలోని ఒక ఫంక్షన్ హాలులో జరిగిన వివాహానికి వీఐపీలు హాజరయ్యారు. పాపన్నపేటకు చెందిన రిపోర్టర్ బాల్‌కిషన్ కూతురు వివాహం ఆదివారం పాపన్నపేటలోని మంజీరా ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహానికి మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి మండల పరిధిలోని వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో భక్తుల సందడి

ఏడుపాయల్లో అమ్మవారి దర్శనం కోసం భక్తుల తాకిడి

పాపన్నపేట, ఏప్రిల్ 20: ఏడుపాయల వనదుర్గాభవానీ మాత సన్నిధిలో ఆదివారం పెద్దఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. భక్తులు భారీ సంఖ్యలో ఏడుపాయలకు తరలివచ్చారు. వీరు మాంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్,సిబ్బంది శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాంరావు, బత్తిని, నర్సింహులు, రాజు, వరుణాచారి ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ,పార్థీవశర్మ,రాముశర్మ,నాగరాజు శర్మ పూజలు నిర్వహించారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఊడిన బస్సు చక్రాలు.. తప్పిన ప్రమాదం

తూప్రాన్, ఏప్రిల్ 20: ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు చక్రాలు ఊడిపోయాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ నుంచి 35 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఆదివారం తెల్లవారుజామున తూప్రాన్ మండలం నాగులపల్లి 44వ జాతీయ రహదారి బైపాస్ రోడుపై హల్దీవాగు వంతెన సమీపానికి చేరుకున్నది. ప్రమాదవశాత్తు ఆ బస్సు వెనుక చక్రాలు ఊడిపోయాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును డివైడర్ వైపు మళ్లించాడు. దీంతో డివైడర్‌ను ఢీకొని బస్సు ఆగిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

యువకులు క్రీడా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి

క్రీడా కిట్లు అందజేస్తున్న జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి

చేగుంట, ఏప్రిల్ 20: యువకులు క్రీడా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం చేగుంటలోని పలువురికి క్రీడా వస్తువులు షటిల్ బ్యాట్స్, నెట్, కాక్స్ అందించారు. విష్ణు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు క్రీడా కిట్లు ఇవ్వాలని కోరడంతో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టైలర్ శ్రీను, దాసోజు కృష్ణ, సిద్దిరాములు, మనోహర్, ఎన్ సతీశ్, విష్ణు, ప్రశాంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ప్రకాశ్‌రాజు, సురేశ్, నరేశ్, మహేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

జీపీకి ట్రాక్టర్‌ట్రాలీ డొనేషన్‌పై హర్షం

కృతజ్ఞతలు తెలుపుతున్న గూడురు గ్రామస్తులు

శివ్వంపేట, ఏప్రిల్ 20: గూడురు గ్రామానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ రూ.లక్షా 50వేల సొంత ఖర్చులతో ట్రాక్టర్ ట్రాలీ డొనేట్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారని మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కొన్ని రోజులుగా పంచాయతీ పారిశుధ్యం, ట్రాక్టర్ ట్రాలీ లేనందున సొంత ఖర్చులతో ట్రాలీ సమకూర్చినందుకు గ్రామస్తులందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొత్తకుమ్మరి శ్రీనివాస్, బేగరి నర్సయ్య, యువకులు ఉన్నారు.

అనుమతుల్లేకుండా మట్టి తరలింపు

అనుమతులు లేకుండా మట్టిని తెస్తున్న టిప్పర్లు

వెల్దుర్తి, ఏప్రిల్ 20: అనుమతులు లేకుండా జేసీబీ, టిప్పర్ల సహాయంతో భారీగా మట్టిని తరలిస్తూ ఖాళీ స్థలంలో పోస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వెల్దుర్తి మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులో నుంచి టిప్పర్లలో మట్టిని తెస్తూ వెల్దుర్తి–తూప్రాన్ ప్రధాన రహదారి పక్కన గ్రామ వైకుంఠధామం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పోస్తున్నారు. సెలవు రోజు కావడంతో ఆదివారం ఉదయం నుంచి టిప్పర్ల ద్వారా భారీగా మట్టిని తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణాల కోసం భారీగా మట్టిని తరలిస్తే మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటెప్పుడు?

రామాయంపేట రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం

పేట ఏఎంసీ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

గొల్పర్తి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

- రోడ్లపై, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు
- ధాన్యం వచ్చి 15రోజులు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఆయోమయంలో రైతులు

రామాయంపేట, ఏప్రిల్ 20: ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ధాన్యం చేతికొచ్చి 15 రోజులు గడుస్తున్నా ఇంత వరకు రామాయంపేట మండలంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయలేదు. ధాన్యం ఆరబోసి వారం గడిచినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలపై ఇప్పటి వరకు ఉలుకు పలుకు లేదు. వర్ష సూచనలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో అన్నదాతలు ఆందోళనలకు గురవుతున్నారు. గతేడాది నష్టాలకు గురైన రైతులు మళ్లీ అలాంటి పరిస్థితి రావద్దంటూ కోరుకుంటున్నారు. ఇప్పటికీ రామాయంపేటలోని మార్కెట్ యార్డుతో పాటు గొల్పర్తి కొనుగోలు కేంద్రం, తారు రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోశారు.

ధాన్యం ఆరబోసి వారం అవుతున్నది

ధాన్యం ఆరబోసి వారం రోజులు అవుతున్నది. ఇంతవరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. ధాన్యం మొత్తం ఎండిపోయింది. తూకం వేయడమే ఆలస్యం. ప్రభుత్వం తొందరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే తమకు వచ్చిన ఆ కాస్త పంటకు డబ్బులు వస్తాయి.

- బెస్త పెంటయ్య, గొల్పర్తి

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వారం రోజుల నుంచి రోజూ ఆరబోసిన ధాన్యం వద్దనే ఉంటున్నం. ఒక్క వర్షం వచ్చినా ధాన్యం అంతా కొట్టుకుపోతుంది. దీంతో మా నోట్లో మట్టి పడ్తుంది.

- ఎర్రం పెంటవ్వ, లక్ష్మి, మహిళా రైతులు, రామాయంపేట

శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

కనులపండువగా ఈస్టర్ వేడుకలు

పెద్దశంకరంపేట: సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నర్సాపూర్‌లో క్యాండిల్స్ ప్రదర్శిస్తున్న మహిళలు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 20: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మెదక్ చర్చిలో ఆదివారం తెల్లవారు జామున నుంచి ఈస్టర్ వేడుకలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. గుడ్ ఫ్రైడే రోజు శిలువపై అవుసులు బాసిన యేసు ప్రభువు మూడో రోజు సమాధి నుంచి భక్తులకు దర్శనమిస్తాడు. యేసయ్య లేచి వచ్చాడన్న ఆనందంలో మునిగిపోతారు. దీన్నే క్రైస్తవులు ఈస్టర్ (పునరుత్థాన పండుగ) జరుపుకొంటారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని మెదక్ డయాసిస్ పరిధిలోని జిల్లాల నుంచే గాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో చర్చి కిక్కిరిసిపోయింది. దూర ప్రాంతాల నుంచి భక్తులు శనివారం నుంచే తరలిరావడంతో వసతి గృహాలు దొరకక ఆరు బయటే ఉండిపోయారు.

శిలువ ఊరేగింపుతో వేడుకలు ప్రారంభం

మెదక్ చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో శిలువ ఊరేగింపుతో ఈస్టర్ వేడుకలు ప్రారంభమయ్యాయి. మహిళలు కొవ్వొత్తులు వెలిగించి స్మరించుకున్నారు. కొంత మంది క్రైస్తవులు తమ ఆప్తుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. వేడుకల్లో చర్చి పాస్టర్లు డేవిడ్, శ్రీనివాస్, జైపాల్, సీఎస్ఐ సంఘం సభ్యులు గంట సంపత్, సంశాన్ సందీప్, జాన్సన్, గెలెన్, జాయ్‌ముర్రే, సువన్‌డగ్లస్, వికాస్, సునీల్, రోలండ్‌పాల్ పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, ఏప్రిల్ 20: నర్సాపూర్‌లోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ పండుగ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో చర్చి ప్రెస్ బైటర్ ఇన్‌చార్జి రెవ సందీప్ గురువులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్ స్థానంలో భూభారతి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించిన కలెక్టర్

కొల్చారం: భూ భారతి చట్టంపై అవగాహణ కల్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం/కౌడిపల్లి, ఏప్రిల్ 20:ధరణి పోర్టల్ స్థానంలో ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేసిందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం కొల్చారం, కౌడిపల్లి రైతు వేదికలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కలిపించారు. కళాకారులు భూ భారతి చట్టంపై కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా రైతులకు భూ సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉటుందన్నారు. రైతులు తమ సమస్యలు హెల్ప్ డెస్క్ ద్వారా అందజేయాలన్నారు. పలువురు రైతులు, యజమానులు తమ సమస్యలు తెలుపగా ఆర్డీవో మహిపాల్ రెడ్డి వారికి సమాధానాలిచ్చారు. అనంతరం ఆర్డీవో భూ భారతి చట్టం మార్గదర్శకాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కొల్చారం తహసీల్దార్ గఫర్ మియా, మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, వ్యవసాయ అధికారి పుణ్యవతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

పాపన్నపేట, ఏప్రిల్ 20: ఆటో డ్రైవర్లకు ఎన్నికల హామీల్లో ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని జిల్లా నాన్ పొలిటికల్ జేఏసీ నాయకులు కోరారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్ కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. మహాశక్తి పథకం ద్వారా ఆటో డ్రైవర్లు ఈఎమ్ఐ,అప్పులు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. అనెల 25న మెదక్ జిల్లా నుంచి ఆకలి కేకల రథయాత్ర ప్రారంభమై తెలంగాణ రాష్ట్రం మొత్తం 119 నియోజకవర్గాలు తిరుగుతూ మే 27న ఇందిరా పార్కు వద్ద ముగించనునట్లుల్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా నాన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు మొహమ్మద్ జఫిరుద్దిన్,ఉపాధ్యక్షుడు రాకేష్ గోస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి భూమయ్య, మెదక్ టౌన్ అధ్యక్షుడు ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పేటలో నిర్మించిన రామాలయం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 20: ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు సీతారామ చంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు తెలిపారు. ఈనెల 21న గణపతిపూజ, పుణ్యహవచనం, 22న లక్ష పుష్పార్చన, 23న యంత్ర, మూర్తి, ధ్వజ, ప్రాణ ప్రతిష్ఠాపననోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రంగం పేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరై ప్రవచనాలు గావిస్తారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నిజాంపేట, ఏప్రిల్ 20: నార్లాపూర్‌కు చెందిన నీలం ప్రత్యూషకు రూ.34,500, కమ్మరి బ్రహ్మచారికి రూ.11 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం స్థానిక నాయకులు తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్ చెక్కులు అందజేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శంకర్, ఇన్‌సెట్‌లో నాగధర బేతయ్య (ఫైల్)

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 20: పొలంలో వరికి నీరు పెడుతుండగా విద్యుదాఘాతంతో రైతు నాగధర బేతయ్య (50) మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మఖ్త లక్ష్మాపూర్‌లో జరిగింది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపుర్‌కు చెందిన నాగధర బేతయ్య వరి పంట చుట్టూ అడవి పందుల బారిన పడకుండా రక్షణ కోసం విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశాడు. ఆదివారం ఉదయం వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ షాక్ తగిలి రైతు బేతయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట దవాఖానకు తరలించారు.మృతుడి భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే దోహదం

నర్సాపూర్, ఏప్రిల్ 20: ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి, క్రమశిక్షణకు కరాటే దోహదపడుతుందని ఎస్సై లింగం పేర్కొన్నారు. రెంజుకి షోటో కాన్ కరాటే ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో నర్సాపూర్, మెదక్, అన్నారం, కౌడిపల్లి, రుస్తుంపేట గ్రామాలకు చెందిన 80 మంది విద్యార్థులకు కరాటే పరీక్షలో పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నర్సాపూర్ ఎస్సై లింగం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్స్ నగేశ్, జి.అశోక్, సత్యనారాయణ, నరసింహా, ప్రసన్న,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులతోనే అసమానతలు దూరం

శివ్వంపేట, ఏప్రిల్ 20: ఉన్నత చదువులతో సమాజంలోని అసమానతలు తొలుగుతాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని దంతాన్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సమాజంలో అన్ని కులాలకు అండగా నిలిచి 30 ఏండ్లు దీర్ఘ పొరాటంలో ఎస్సీ ఏ, బీ, సీ సాధించిన రిజర్వేషన్లు 59 ఉపకులాలకు సమన్యాయం జరగాలన్నారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఎస్సీల కోసం నిరంతరంగా పోరాడుతున్నారన్నారు. చదువుతోనే అసమానతలు సంపూర్ణంగా తొలిగిపోతాయన్నారు. కన్నారంకుమార్, కొమ్ము శేఖులు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మురళీ మాదిగ, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలుదాం

వెల్దుర్తి, ఏప్రిల్ 20: ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాసాయిపేట మండలం నుంచి భారీగా తరలివెళ్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభ కోసం తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ పార్టీ చేయబోయే పోరాటాలను కేసీఆర్ మాటల్లో వినడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సభ విజయవంతం కోసం ప్రజలు ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు

వెంకటరాజాగౌడ్

రామాయంపేట, ఏప్రిల్ 20: రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తే వాహనదారుల విలువైన ప్రాణాలు పోతున్నాయని వారి కుటుంబాలు రోడ్డున పడి బతకలేక పోతున్నారని అన్నారు.ఇప్పటికైనా రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయకుండా మరెక్కడైనా ఆరబోస్తే బాగుటుందన్నారు. పోలీసుల హెచ్చరికలను కాదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండెపోటుతో మహిళ మృతి

కమలమ్మ(ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 20: గుండెపోటుతో మహిళ మృతి చెందిన ఘటన రెడ్డిపల్లిలో చేటు చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తలారి కమలమ్మ(60) తన పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా మార్గ మధ్యలో గుండె పోటు వచ్చింది. దీంతో అక్కడికక్కడే కుప్ప కూలి మృతి చెందింది. మృతురాలి భర్త బాల్‌నర్సంహులు గతంలో మృతి చెందాడు. వారికి నలుగురు కూతుర్లు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రామాయంపేట, ఏప్రిల్ 20: పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఆదివారం రామాయంపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో, గొల్పర్తి మండలంలోని సుతారిపల్లి, రాయిలాపూర్, డీ.ధర్మారం గ్రామాల్లో తహసీల్దార్ రజినీకుమారి, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం ప్రారంభించారు.

వడదెబ్బ తో రైతు మృతి

వీరయ్య (ఫైల్)

కొల్చారం, ఏప్రిల్ 20: వడదెబ్బ తగిలి రైతు మృతి చెందిన ఘటన కొల్చారంలో ఆదివారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యెండుగుల వీరయ్య (65) పశువులు కాస్తూ జీవిస్తున్నాడు. తనకు ఇద్ద రు కుమారులు. చిన్న కుమారుడు రాజు ఇటీవల మృతిచెందాడు. పెద్దకుమారుడు శేఖులు ఉపాధి నిమిత్తం భార్యా పిల్లలతో హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. కొడుకు, కోడళ్లు నాటు వేసి ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస పోయారు. వీరయ్య ఉన్న వ్యవసాయ పొలానికి నీళ్లు పెడుతూ పశువులు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. వేసవి కావడంతో పశువులను పొద్దున మేతకు తీసుకెళ్లి మధ్యాహ్నం ఇంట్లోనే ఉంచి పచ్చి మేత వేసేవాడు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా పశువుల పచ్చి మేతకు మధ్యాహ్నం మండుటెండలో పొలం గట్టుల వెంబడి పచ్చి మేత కోశాడు. దీంతో కాస్త అస్వస్థతకు గురయ్యాడు. యథావిధిగా ఆదివారం పశువులకు పచ్చి మేత తెచ్చి, కొల్చారం పరిధిలోని గిరిజన తండాలో తెలిసిన వారి వివాహం ఉండడంతో ఆ కార్యక్రమానికి హాజరయ్యాడు. భోజన సమయంలో అందరితో పాటు భోజనం చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి డాక్టర్లు పరిశీలించి, వడదెబ్బతో అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.